# అపురూపం

ఆఫీసునుంచి వస్తూనే అలవాటు ప్రకారం ఉత్తరాలేమయినా వచ్చాయేమోనని టేబిలుమీద చూసేడు చలపతి. రెండు ఉత్తరాలున్నాయి. ఒకటి తండ్రి నుంచి, రెండోది గంగాధరం నుంచి.

ఆత్రుతగా రెండోది చించి చదివేడు.

''చలపతీ! వచ్చే ఆదివారంనాడు విశాఖపట్నం వస్తావా? నీకో అపురూపమయిన వస్తువుని చూపిస్తాను. అది నువ్వు తప్పక చూడాలని నా కోరిక. అన్నట్టు... వచ్చేటప్పుడు నీ శ్రీమతిని కూడా తీసుకురావాలి. మీ రాకకోసం నేనూ, మా ఆవిడా ఎదురు చూస్తూ ఉంటాం.''

ఇదీ ఉత్తరంలోని సారాంశం.

గంగాధరం చాలా విచిత్రమయిన మనిషి. వాడి మాటా, ప్రవర్తించే తీరూ కూడా తమాషాగానే ఉంటాయి.

ఏదో విచిత్రమయిన వస్తువుని చూపిస్తాడుట! చాలా అపురూపమయినదిట! అందుకోసం చూడ్డానికి పనిగట్టుకుని విశాఖ రమ్మంటున్నాడు.

చలపతిలో కుతూహలం హెచ్చింది. ఏం చూపిస్తాడో ఎంత ఆలోచించినా మనసుకి తట్టడంలేదు.

కొత్త కొత్త వస్తువులని సేకరించడం గంగాధరం హాబీ. ఏ అపురూపమయిన వస్తువుని సేకరించాడో!

గంగాధరానికి చాలామంది స్నేహితులున్నారు. తనకి రాసినట్టుగానే అందరినీ ఆహ్వానిస్తూ రాసేడేమో!

వెళ్తే కానీ తెలీదు.

చిన్నప్పటి స్నేహితులందరినీ ఈ మిషతో ఒకచోట చేర్చి, తను సంపాదించిన అపురూప వస్తువుని చూపించాలని సరదా పడుతున్నాడు కాబోలు...

'ఏమయినా విశాఖ వెళ్లాలి' అనుకున్నాడు చలపతి.

విశాఖ వెళ్తే ఓసారి అందరినీ చూసినట్టుంటుంది. చాలా ఏళ్ల తరువాత చిన్నప్పటి స్నేహబృందంతో సరదాగా కబుర్లు చెప్పుకోవచ్చు. ఒకవిధమయిన యాంత్రికత, స్తబ్ధతలతో ఈ మధ్య లైఫ్‌మరీ నిస్సారంగా తోస్తోంది. ఏదో మొనాటనీ జీవితంలో రంగూ రుచీ హరించివేసింది. తన మూడ్ కూడా కొద్దిరోజులుగా

ఏమి బాగుండడంలేదు. కోపం. చిరాకు, అసహనం ఎక్కువయిపోతున్నాయి.

లోపం తనలోనే ఉందని తెలుస్తూనే ఉంది. కానీ దానిని సవరించుకుని ఎలా బయటపడటమో అర్థం కావడంలేదు. ఏ రోజుకారోజు తన ప్రవర్తననీ, ఆలోచనా విధానాన్నీ మార్చుకోవాలని తలపోస్తూనే ఉన్నాడు. కానీ ఎలా ఉండాలనుకుంటున్నాడో అలా ఉండలేకపోతున్నాడు. ఈ స్థితిలో విశాఖ ప్రయాణం ఒక ఊరట.

చలపతి బట్టలు మార్చుకుని, బాత్‌రూమ్‌లోకి వెళ్లివచ్చి కుర్చీలో కూచున్నాడు. భార్య వందన కాఫీ కప్పు టేబిలుమీద పెట్టి వంటింట్లోకి వెళ్లిపోయింది.

చలపతికి మనసు చివుక్కుమంది, తనకీ, భార్యకీ మధ్య ఏదో అగాధం ఏర్పడింది. రోజురోజుకీ అది ఎక్కువవుతూనే ఉంది. ఆ దూరం తగ్గి తాము సన్నిహితంగా, మునపటిలా అన్యోన్యంగా ఉండే అవకాశం కనిపించడంలేదు.

తనకి తెలుసు తమ దంపతుల మధ్య ఈ పరిస్థితి ఏర్పడటానికి తనే కారణం.. ఒకరకంగా తనని తాను సమర్థించుకోడానికి ఎన్నో కారణాలున్నాయి. కానీ అవేవీ మనసుతో నిజాయితీగా ఆలోచిస్తే నిలబడవు.

చలపతికి మనసు వికలమైపోయింది. వందనని చూస్తే ఆమె పట్ల తన ప్రవర్తన ఎంత అనుచితంగా ఉందో అనిపించి బాధగా ఉంటోంది.

ఇంట్లో నెలరోజులుగా ఈ కోల్డ్‌వార్ జరుగుతోంది. వందనకీ, తనకీ దాదాపు మాటలు లేవనే చెప్పాలి. ఇద్దరూ ముభావంగానే ఉంటున్నారు.

ఆ రోజు జరిగిన సంఘటన గుర్తొచ్చింది చలపతికి.

ఆరోజు... ప్రదీప్ ఆఫీస్ స్టాఫ్ అందరికీ డిన్నర్ ఇచ్చేడు. ప్రదీప్ తమ ఆఫీసులో కొత్తగా చేరి యువకుడు. అతని పెళ్లికి ఆడిట్ కారణంగా ఆఫీసు స్టాఫ్ ఎవరూ వెళ్లలేకపోయారు. అందువల్ల, అతని పెళ్లి జరిగాక, శెలవు ముగిసేక రాగానే విందుభోజనం పెట్టించాల్సిందే అని స్టాఫ్ పట్టుపట్టేరు.

కాదనకుండా డిన్నర్ ఏర్పాటు చేశాడు.

కాస్త భారీగానే ఉన్నాయి ఏర్పాట్లు. ఆఫీసు స్టాఫ్ అంతా కుటుంబాలతో వచ్చేరు. ఊళ్లో తనకి పరిచయం ఉన్నవాళ్లనీ, మరికొందరినీ కూడా పిలిచినట్టున్నాడు. మేడమీద షామియానా వేయించి లైటింగ్‌తో డెకరేషన్ చేయించాడు. స్టీరియోలో నుంచి మంద్ర స్వరంతో షెహనాయ్ వినిపిస్తోంది.

చాలాసేపటి వరకు సరదాగానే గడిచి పోయింది. అంతా నవ్వుతూ కబుర్లు చెప్పుకున్నారు. ప్రదీప్ అదృష్టాన్ని అంతా పొగిడేరు.

ప్రదీప్ భార్య అందంగా ఉంది. కలవారి ఇంటి నుంచి వచ్చిందని ఆ కట్టూ బొట్టూ, వేషధారణ, అలంకరణ చెప్పకనే చెబుతోంది. మనిషిలో రవంత అతిశయం తొంగి చూస్తోంది.

అవును మరి! ప్రదీప్‌కి రెండులక్షలదాకా కట్నం ఇచ్చి, ఆపైన ఫ్రిజ్, కలర్ టీ.వీ. హీరో

హోండాలాంటి విలువయిన కానుకలిచ్చి వైభవోపేతంగా ఆ పెళ్లి జరిపించాడు ఆమె తండ్రి. ఆమె వారికి ఏకైక సంతానం. పెట్టుపోతలంకి లోటుండదు. ముచ్చట్లకీ, మురిపాలకీ అంతుండదు. ప్రదీప్ మామగారు విశాఖలో కొత్తగా కట్టిస్తున్న ఖరీదైన ఇల్లు కూడా ఈ మధ్యనే అల్లుడి పేర రిజిస్ట్రేషన్ చేయించారు.

ప్రదీప్ లేనివాడేమీ కాదు. ఉన్నంతలో ఆస్తిపరుడికిందే లెక్క. కానీ ఈ పెళ్లితో అమాంతంగా అతనికి అయాచితంగా అన్నీ సమకూరేయి. ఒక్కసారిగా అతని బ్యాంక్ అకౌంట్, హోదా ఎన్నోరెట్లు పెరిగాయి.

డిన్నర్ తీసుకుందుకు వచ్చినవాళ్లలో ప్రదీప్‌ని పొగడనివాళ్లు లేదు. అతని అదృష్టాన్ని కీర్తించనివాళ్లు లేరు. స్టాఫ్‌లో చలపతిలాంటి సాధారణ గుమాస్తాలు కొందరు ఆ సంభాషణలో మామూలుగానే కలుపంచుకుంటూనే మనసుల్లో కాస్త అసూయపడిన మాట మాత్రం వాస్తవం. వాళ్లమాటల్లో, చూపుల్లో ఎంత దాచుకుందామన్నా సరే, ఆభావం ప్రస్ఫుటమవుతూనే ఉంది. ఏదో అసంతృప్తి లీలగా వారి వదనాల్లో ద్యోతకమవుతూనే ఉంది.

కలగాపులగంగా సాగిన ఆ సంభాషణ అలా సాగి సాగి సొంత విషయాల్లోకి దారితీసింది.

ఎప్పుడో చాలా ఏళ్ల కిందట పెళ్లిళ్లు చేసుకున్నవారు - ''తప్పుచేశాం, గురూ! అప్పట్లో ఇలా మామగారి ముక్కుపిండి వసూలు చేయడం చేతనయింది కాదు. ఎంతిస్తే అంతే అని సరిపెట్టుకుని పెద్దాళ్లు చూసిన అమ్మాయి మెడలో మూడు ముళ్లూ వేసేశాం. పేరుకే కట్నం కానీ, పెళ్లి ఖర్చులకి కూడా బొటాబొటిగా సరిపోయిందంటే నమ్మండి! అదీ కాక, ఈ కాలం కుర్రాళ్లు పెద్ద కట్నకానుకలు తెచ్చే అమ్మాయిలను సెలెక్ట్ చేసుకోవడమే కాక, కాబోయే భార్య తప్పనిసరిగా సంపాదించేదిగా ఉండేలా జాగ్రత్త పడుతున్నారు. చాలా ఇంటెలిజెంట్ ఫెలోస్! బై ది బై సో లక్కీ ఫెలోస్ ఆల్సో! అలాంటి ముందుచూపు, జాగ్రత్తలూ లేకపోవడం వల్ల... ఇదిగో, ఇలా ఉన్నాం!'' సూపరింటెండెంట్ కోసలరావు మాటలకి అంతా తలలాడిస్తూ పగలబడి నవ్వేరు. ఆడవాళ్లు మాత్రం ఈ సంభాషణ నచ్చక ముఖాలు చిట్లించేరు.

''అంతే సార్... అంతే... ప్రేమాదోమా, ఆదర్శం చట్టుబండలూ అంటూ కాళ్లదగ్గరకొచ్చే లక్ష్మిని కాలదన్నుకున్నాం. ఇప్పుడిలా అఘోరిస్తున్నాం! దేనికయినా ప్రాప్తం ఉండాలి, సార్!'' మరొకతను వంతపాడేడు.

అనుకోకుండా చలపతి కూడా వాళ్ల సంభాషణలోకి దూరేడు.

జోవియల్‌గా మాట్లాడుతున్నాననుకుంటూనే చెలరేగిపోయాడు. వందనని తాను కారుచవకగా పెళ్లిచేసుకోవడం వల్ల ఎంతగా నష్టపోయిందీ అందరికీ వర్ణించి మరీ చెబుతూ నవ్వించాడు.

అతని మాటలకి అందరూ పొట్టచెక్కలయ్యేలా నవ్వసాగేరు. దాంతో చలపతి ముందూ వెనకా ఆలోచించకుండా గడగడా ఏదో వాగేశాడు - పక్కనే భార్య వందన ఎంతగా నొచ్చుకుంటుందో కూడా గమనించలేదు.

వందన మాత్రం వాటిని సరదా కబుర్లుగా తీసుకోలేకపోయింది. ఆమె గుండె కలుక్కుమంది.

ముఖం చిన్నబోయింది. కళ్లలో కోపం బుసలు కొట్టింది. మర్యాదకోసం అక్కడేమీ గొడవ చేయకుండా ముభావంగా ఉండిపోయింది.

డిన్నరునుంచి ఇంటికొచ్చాక చలపతి, వందనల మధ్య రగడ మొదలయింది.

* * *

సారీ చెప్పుకుని సర్దిచెప్పబోయేడు చలపతి. వందన వినిపించుకోలేదు. హాస్యాన్కి కూడా హద్దూ పద్దూ ఉండాలని ఖండితంగా చెప్పింది. మనసులో లేనిది మాటల్లో పైకి రాదని తెగేసి అంది.

వారిమధ్య వాదన తారస్థాయికి చేరుకుంది.

చలపతిలో సహజంగా ఉండే పురుషాహంకారం మరింత వికృతరూపం ధరించింది.

ఆమె మనసు బాధపడేలా తను డిన్నర్‌లో చేసిన వ్యాఖ్యలని సమర్థించుకోడానికి దారులూ, మాటలూ వెతుక్కున్నాడు. ఆ ధోరణిలో అతను వందన తండ్రిమీద, పెళ్లినాడు తనకీ, తనవారికీ జరిగిన మర్యాదలలో లోపాలగురించీ చాలా వెటకారంగానూ, తీవ్రంగానూ ఆరోపణలు చేశాడు. మాటమీద మాట పెరిగింది.

పెళ్లిలో వందన తల్లిదండ్రులు తమకి పెట్టిన బట్టలు, వస్తువులూ అన్నీ మహానాసిరకంగా ఉన్నాయని, తాము కనక పోనిమ్మని సర్దుకుపోయేమని అరుస్తూ చెప్పేడు చలపతి.

వందనకి దుఃఖం ఆగింది కాదు. ఏడుస్తూ కూచుంది.

కోపంలో నోటికొచ్చినట్టు అనేశాడే కానీ, తానెంత మూర్ఖంగా మాట్లాడాడో చలపతి గ్రహింపు చేసుకునేసరికి పరిస్థితి చెయ్యిదాటిపోయింది. మగబుద్ధి తనలోని వివేకాన్ని ఎలా నాశనం చేసిందో గ్రహించేసరికి పరిస్థితి మారిపోయింది. ఎంత బతిమాలినా వినకుండా వందన పుట్టింటికి వెళ్లిపోయింది.

సరదాగా ప్రారంభించిన సంభాషణ చివరికి ఎంత చిచ్చుపెట్టిందో ఆలోచిస్తే చలపతికి కంపరం కలిగింది. చలపతీ, వందనా గొడవపడ్డారన్న సంగతి ఆ ఇంటి గోడలు దాటి ఆ నోటా, ఈ నోటా అందరికీ పాకిపోయింది. చలపతి ఆఫీసులోనూ, బయటా తలెత్తుకుని తిరగలేకపోయాడు.

భార్య చేతివంటని పరాయివాళ్లముందు తిట్టిపోస్తూ వెటకారంగా మాట్లాడేవాళ్లూ, భార్య అందచందాలని గురించి మూడోమనిషితో అసహ్యంగా మాట్లాడేవాళ్లూ, సంపాదనపరురాలు కాని భార్యని తేలికచేసి మాట్లాడేవాళ్లూ... ఏ తప్పు చేశారో, తనూ అదే తప్పు చేసేడు చలపతి. ఉన్నతంగా ప్రవర్తించాలంటే ఆ ఔన్నత్యం సహజంగానే మనిషిలో ఉండాలి. పుట్టి పెరగాలి. వ్యక్తిత్వం వికసించాలి.

ఒక మంచి భర్తగా వందన మెచ్చుకోలునీ, బంధుమిత్రుల అభిమానాన్నీ చూరగొన్న తను చివరికి ఏం చేశాడు?

తేలిపోయాడు! తనలో ఇన్నాళ్లూ దొంగతనంగా దాక్కున్న 'మగబుద్ధి' ఒక్కసారిగా బయటపడిపోయింది.

వందన పుట్టింటికి వెళ్లిపోయేక చలపతిలో వేదన ఎక్కువయింది. పశ్చాత్తాపం కలిగింది. వద్దు ...ప్పనుకుంటూనే కొన్నాళ్లు బింకం ప్రదర్శించేడు. చివరికి బింకం సడలించుకుని, తనే వెళ్లి ...లుచుకొద్దామనుకున్నంతలో వందనే తిరిగి వచ్చింది. తమ మధ్య జరిగిన వివాదం ఎలా తెలిసిందో, వందన ...ల్లిదండ్రులు కూతురికి నచ్చచెప్పి పంపించేరు. అయిష్టంగానే వచ్చింది వందన. అయిష్టంగానే ...ులుగుతోంది. ఆమె తిరిగి వచ్చినదగ్గరనుంచీ కూడా తమ మధ్య సరిగా మాటలు లేవు. మనసులు విప్పి ...ాటలాడుకోవడం జరగడంలేదు.

తను నిజంగా పశ్చాత్తాపం చెందుతున్నాడని వందన పూర్తిగా నమ్మేవరకూ తమ మధ్య ఏర్పడిన ...ాధం పూడుకునేలా లేదు. ఈ తెగిపోయిన సూత్రానికి ముడిపడదు. అసలింతకీ తన పశ్చాత్తాపం వి... ...సనీయమయినదేనా? తనకే పూర్తి నమ్మకం లేదు.

భార్య సరదాగా ఉండకపోవడంతో చలపతిలో అసహనం రెట్టింపయింది. భార్య సహాయ నిరాకరణ ...ి ...స్తేవంగదీస్తోంది.

భార్య ఇంత కఠినంగా తనని శిక్షించడానికి తను నిజంగా అంత తప్పు చేశాడా?' అని ...ధనపడసాగేడు. అవగాహనా లోపం వల్ల వారిమధ్య దూరం అలాగే ఉండిపోయింది.

* * *

ఇలాంటి పరిస్థితుల్లో వచ్చింది గంగాధరం నుంచి ఉత్తరం.

వందనికి చెప్పి బయలుదేరమన్నాడు. ఆమె అంతగా ఆసక్తి చూపలేదు.

''నా మనసేం బాగాలేదు, మీరు వెళ్లిరండి!'' అంది ముక్తసరిగా.

''ఏదో అపురూపమయిన వస్తువుని చూపిస్తాడుట. నీకు ఇంటరెస్టింగ్‌గా అనిపించడంలేదూ!'' ...రదాగా ఉండడానికి ప్రయత్నిస్తూ అన్నాడు చలపతి.

వందన ఏం మాటలాడలేదు. వస్తాననీ అనలేదు. రాననీ అనలేదు.

చివరికి ఆదివారంనాడు బట్టలు సర్దుకుంటూంటే ముభావంగానే తనూ వస్తానని బయలుదేరింది. ...ద్దరూ బస్సులో విశాఖ చేరుకున్నారు.

* * *

గంగాధరం ఇంట్లో వందనకీ, చలపతికీ మంచి ఆదరమే లభించింది. గంగాధరం దంపతులు వారిని ...తో ఆదరంగా రిసీవ్ చేసుకున్నారు. నవ్వుతూ కబుర్లు చెప్పారు.

చలపతి ఊహించినట్టుగా ఇతర మిత్రులెవరూ రాలేదు. కాస్త ఆశ్చర్యం కలిగినా కాసేపటికి ఆ ...ంత మరిచిపోయాడు.

. రోజంతా గంటలు నిమిషాల్లా గడిచిపోయేయి.

గంగాధరం ఇల్లు - నిజానికి ఓ కళాఖండంలా కనిపిస్తుంది. చక్కని పెయింటింగులూ, కంటి

ఉంపైన రంగుల్లో డిజైన్ చేసిన కర్టెన్లూ, సోఫా సెట్లూ, పొందికగా, ఎంతో శ్రద్ధతో అమర్చిన వస్తువులూ...
అన్నిటికీ మించి ఆర్ద్రత స్నేహ వాత్సల్యాలు నిండిన సంభాషణా శైలి.

సున్నంవేసిన నాలుగుగోడల గదుల మధ్య మనుషులు అంత నిర్మలంగా, స్వచ్ఛంగా తేటగా ఉండొచ్చునని గంగాధరానికి అర్థమై అబ్బురపడ్డాడు.

తాను చేతులారా ఏది పోగొట్టుకుంటున్నాడో, దానిని గంగాధరం తన కుటుంబ సభ్యులతో రెండు చేతులతో ఆప్యాయంగా జుర్రుకుంటున్నాడనిపించింది. ఈ ఆలోచన కలగగానే ఒకవేదనా వీచిక కరిమబ్బు రేఖలా చలపతి ముఖంమీద చోటు చేసుకుంది. గుండెలో తుమ్మముల్లు దిగబడినట్టు బాధ కలిగింది.

గంగాధరం దంపతుల ఆదరాభిమానాలతో వందన ముఖంలో కూడా చాలారోజులకి ఆనందం కనిపించింది. మనసు విప్పి వాళ్ళ సంభాషణలో పాల్గొంటోంది.

"ఇంతకీ నువ్వు చూపిస్తానన్న అపురూపమయిన వస్తువుని చూపిచేవు కాదు!" అడిగేడు చలపతి. ఉదయంనుంచీ అదిగో ఇదిగో అంటూ సస్పెన్స్‌లోనే ఉంచుతున్నాడు గంగాధరం.

ఆ రాత్రి కూడా కబుర్లతోనే గడిచిపోయింది. ఆ వస్తువుని చూడాలనే ఆత్రం ఉన్నప్పటికీ, ఆ కబుర్ల ధ్యాసలో ఆ విషయం కాస్త మరుపున పడిపోయింది చలపతికి.

మర్నాడు బయలుదేరుతూంటే గంగాధరం భార్య వందనకి బొట్టు పెట్టి చీర, జాకెట్టు ఇచ్చింది.

అప్పుడు హఠాత్తుగా జ్ఞప్తికి వచ్చి - "ఇంతకీ నువ్వు చూపిస్తానన్న వస్తువు విషయం మరిచిపోయేవు. ఏదో చూపిస్తానన్నావ్... ఇకనైనా నీ సస్పెన్స్ ఆపి చూపిస్తావా లేదా!" నవ్వుతూ అడిగేడు చలపతి.

అప్పుడు చూపించేడు గంగాధరం ఆ అపురూప వస్తువు!

దాన్ని చూస్తూనే చలపతి, వందనలు విస్తుపోయేరు.

కారణం - అదొక సాధారణమయిన గొడుగు!

"ఇదా!?" అన్నారు ఇద్దరూ అప్రయత్నంగా ఒకేసారి.

గంగాధరం నిండుగా నవ్వేడు. "అవును, నేను చూపిస్తానని చెప్పిన అపురూప వస్తువు ఇదే. నీకు దీనిలో ఏ ప్రత్యేకతా గోచరించకపోవచ్చును. కానీ మా ఇంట్లో దానికి ఓ ప్రత్యేకమయిన స్థానం విలువ, చరిత్ర ఉన్నాయి!".

చలపతి అతని మాటలు అర్థంకాక చూస్తూ ఉండిపోయేడు. గంగాధరం నెమ్మదిగా గుండెకి హత్తుకునేలా ఒక్కో మాటా పేరుస్తూ చెప్పసాగేడు.

"ఇది మా తాతయ్య పెళ్ళినాటి గొడుగు. కాశీయాత్ర వేడుకలో వాళ్ళ మామగారిచ్చిందిట ఇది. ఆ గొడుగంటే తాతయ్యకి ఎంత ప్రాణమో చెప్పలేం... మామగారిది పేదకుటుంబం కావడంతో పెట్టుపోతలేం లేవుట.. కానీ వివాహ సమయంలో ఆచారం ప్రకారం దీన్ని ఇచ్చేరు. నిజానికి ఇది తాతయ్య పెళ్ళినాటి

గొడుగు అన్న మాట కానీ - ఆనాటి గొడుగులున్న పార్టుల్లో ఒక్కటీ ఇప్పుడు మిగల్లేదు. గొడుగు గుడ్డతోపాటు అన్నీ చాలాసార్లు రిపేర్లకోసం మార్చడం జరిగింది. దీనిలో గుడ్డ, కమానులు, చివరికి కర్ర ఏ ఒక్కటీ ఆనాటిది కాదు. కానీ, తాతయ్య దృష్టిలో మాత్రం చనిపోయేవరకూ ఇది తన పెళ్లినాటి గొడుగే. దీన్ని ఎంతో ప్రాణప్రదంగా, అపురూపంగా చూసుకునేవాడు. ఎండకీ, వానకీ కూడా ఇది తాతయ్య చేతిలోనే వుండేది. అమ్మమ్మని ఎంత అపురూపంగా చూసుకునేవాడో దీన్నీ అంత ప్రేమగా చూసుకునేవాడు. ఎప్పుడయినా సరదాకి మేం 'తాతయ్యా! ఇందులో అప్పటి పార్టు ఒక్కటీ మిగల్లేదు కదా! దీన్నింకా నీ పెళ్లినాటి గొడుగే అని చెప్తావేం?' అని అడిగితే -

''ఓరేయ్! ఆ భావనలో తాజాదనం. కమ్మదనం మీకర్థం కావడం కొంచెం కష్టమేనర్రా!'' అనేవాడు నవ్వేస్తూ. తాతయ్య పోయాక ఇది నాన్నకీ, నాన్న పోయాక నా దగ్గరకీ వచ్చిందిది... ఈ అపురూప వస్తువు మా ఇంటికే అలంకారం - ఇదంటే నాకూ, మా ఆవిడకీ కూడా ప్రాణమే!'' చెప్పడం ముగించాడు గంగాధరం.

చలపతి గుండె నిండా ఏదో ఉద్విగ్నత చోటుచేసుకుంది. గంగాధరం తమని పిలిపించి మరీ దీన్ని చూపించి, దీని గురించి చెప్పడం వెనుక అంతరార్థం స్పష్టమవుతూనే ఉంది.

తనకీ, వందనకీ మధ్య చెలరేగిన గొడవలగురించి వాడి చెవిన తమ మిత్రులు ఎవరో వేసి ఉంటారు.. అవును... అదే జరిగి ఉంటుంది...

గంగాధరం తాతయ్య గొడుగు గురించి చెబుతూ ఉంటే వందన ముఖంలో మెరిసిన మెరుపుని పోల్చుకున్నాడు చలపతి.

''వెళ్లొస్తా'' మని చెప్పి ఇద్దరూ బయటికొచ్చారు.

* * *

ప్రయాణంలో ఇద్దరూ ఏమీ మాట్లాడుకోలేదు కానీ, మనసులు విప్పి ఎన్నో చెప్పుకోవాలని ఉవ్విళ్లూరేరు. ఆర్ద్రత నిండిన గుండెలతో ఇంటికి చేరారు.

''మా గంగాధరం ఎంత గొప్ప అపురూపమయిన వస్తువు చూపించేడో చూసేవా వందనా..''

ఇంటికి వస్తూనే చలపతి వందనని కౌగిలిలోకి తీసుకుంటూ తన్మయత్వంగా అన్నాడు - పేరుకది తాతయ్య పెళ్లిగొడుగు అన్నమాటే కానీ, నిజానికది వెన్నపూసలాంటి వాళ్ల తాతగారి మనసుకి ప్రతిరూపం .. లోకంలో అన్నిటికన్నా విలువయినదీ, మలినం కారానిదీ, నిత్యహరితమై కళకళలాడుతూ ఉండాల్సిందీ ఏమిటో తెలిసా? అది - మనిషి మనసు! వాడు చెప్పకపోయినా, మా గంగాధరం చెప్పిందీ, చెప్పదలిచిందీ ఇదే ... అలాంటి మిత్రుడు దొరకడం నా అదృష్టం...'' అంటూ కౌగిలి మరింత బిగించి వందనని ముద్దులతో ముంచెత్తాడు.

చాలాకాలం తర్వాత - ఎంతో ఇష్టంగా, గాఢమయిన ప్రేమోద్రేకంతో భర్త కౌగిలిలో కరిగిపోయింది వందన.

ఇకపై ఆ ఇల్లొక నందనవనమే!

(ఆంధ్రప్రభ. సచిత్రవారపత్రిక. 6.4.1998)